"ఈ ఉప్పెనలు, తుఫానులు భగవంతుడు సృష్టించినవే అయినా, నామీద ద్వేషం లేనప్పుడు ఆయన నన్ను నీళ్ళల్లో ముంచుతాడన్న భయం నాకూ లేదు." చెప్పాడతను.

పడవ క్షేమంగా ఒడ్డుకి చేరాక సన్యాసి భార్య అతనికి పాదాభివందనం చేసి చెప్పింది.

"మీకు సన్యాసాశ్రమ స్వీకారానికి అనుమతి ఇచ్చినందుకు నాకిప్పుడు ఎంతో గర్వంగా వుంది. మీరు చాలా సాధించారు."

## 14. గురువు చేసే పని

ఒకతను గురువు దగ్గరకి వెళ్ళి అడిగాడు.

"గురువు లేకుండా మనిషి మోక్షం పొందలేడని శాస్త్రం అంటోంది. ఇందులో ఎంత నిజం వుంది?"

వెంటనే గురువు ఓ అద్దం తెప్పించి అతనికిచ్చి చెప్పాడు.

"అందులో నీ ప్రతిబింబం కనబడుతోందా? అది మిథ్యా నేను. అద్దం బయట వున్న నువ్వు అసలు నేను. అద్దం ముందు నిలబడే మిథ్యా నేనుని వదిలించుకో చూస్తాను."

"నా వల్ల కాదది." చెప్పాడతను ప్రయత్నించి.

గురువు అద్దాన్ని పగలకొట్టి మళ్ళీ చెప్పాడు.

"ఇప్పుడు మిథ్యా నేను మాయమై అసలు నేను మిగిలావు. అద్దం పగలకొట్టాలని అసలు నేనుకి తెలియదు. ఆ పని చేసేవాడే గురువు."

## 15. కోప నివారణా యంత్రం

ఒకతను ఓ ఆధ్యాత్మిక గురువు దగ్గరకి వచ్చి చెప్పాడు.

"స్వామీ. నాకు ఊరికూరికే కోపం వస్తూంటుంది. దాన్ని కంట్రోల్ చేసుకోవడం నా వల్ల కావడం లేదు. మీరే నాకేదైనా మంచి సలహా ఇవ్వాలి."